అనంతపురం ఎస్ఎస్ఎస్ బిఎన్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

సజావుగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలతో మొదలయ్యాయి. 58 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 22,920 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 22,311 హాజరయ్యారు. 609 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 2135 మందికి గాను 2034 మంది పరీక్షలు రాశారు. 101 మంది గైర్హాజరు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా కేంద్రంలోకి అనుమతి ఉండదన్న నిబంధనతో విద్యార్థులు ముందస్తుగానే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్, కెఎస్ఆర్ జూనియర్ కళాశాల్లో జరుగుతున్న పరీక్షలను కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలియజేశారు.

'ఆయనొక్కడు...అసంతృప్తులు ఐదుగురు..!

◆విజయవాడలో మకాం వేసి ప్రయత్నాలు ◆'అనంత'కు మరో అవకాశం దక్కేనా..!

అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఒకవైపు అయితే ..ఐదుగురు అసమ్మతి నేతలు ఇంకో వైపు అన్నట్టు ఉంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిక్కెట్టు అధికారికంగా ఖరారు కాకపోవడంతో టిక్కెట్టు ఆశిస్తున్న వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే అనంత వెంకటరామిరెడ్డికి టిక్కెట్టు ఖరారైనట్టు ప్రచారం నడుస్తోంది. అసమ్మతి నేతలు మాత్రం తమ ప్రయత్నాలను ఆపడం లేదు. రెండు రోజలుగా అక్కడే మకాం వేసి తమలో ఎవరో ఒకరికి అవకాశం కల్పించాలని అడుగుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలోనూ ఆయన ఒకవైపు, ఐదుగురు నేతలు ఒకవైపు ఉండి ప్రయత్నాలు సాగించారు. అధిష్టానం అనంత వెంకటరామిరెడ్డి వైపు మొగ్గు చూపింది. ఈసారి మార్పు చేపడితే తమకు అవకాశం కల్పించాలని చవ్వా రాజశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాసులు, వైటి.శివారెడ్డి, నదీమ్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డిలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అటు మైనార్టీ, ఇటు బలిజ సామాజిక తరగతులు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నందు వీరికి అవకాశం కల్పించాలని అడుగుతున్నట్టు తెలుస్తోంది. అయితే అనంత వెంకటరామిరెడ్డి మాత్రం పార్టీలో తనకున్న పట్టుతో సైలెంట్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మద్దతుతో సాధించే పనిలోనున్నారు. అంతేకాకుండా ఈ ఐదేళ్లలో నగరంలో ప్రధాన రహదారులను పూర్తి చేయడం, అభివృద్ధి చేసి చూపించానని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా మద్దతు కూడా గట్టే పని కూడా చేస్తున్నారు. ఇప్పటికే గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, తాను చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పాలక వర్గంలో పట్టుపెంచుకున్నారు. తనకు అనుకూలంగా ఉండే వ్యక్తిని మేయరుగా అయ్యేటట్టు చేసుకోవడంలో ఆయన సఫలీకృతమయ్యారు. అసమ్మతి నేతలు ఆ పదవి కోసం పోటీపడినా వారికి కాకుండా తాను అనుకున్న వ్యక్తినే మేయరుగా చేసుకున్నారు. దీంతో నగరంలో ఎక్కడా ఎటువంటి సమస్యలేకుండా తానుకున్న విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయగలిగారన్న చర్చ నడుస్తోంది. సీనియర్ నాయకుడిగానూ అనంత వెంకటరామిరెడ్డి పేరుంది. 1996 నుంచి ప్రజాప్రతినిధిగా ఉంటూ వస్తున్నారు. ప్రారంభంలో ఆయన పార్లమెంటు సభ్యులుగా ఉంటూ వచ్చారు. 2019లోనే తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేశారు. దీంతో జిల్లా రాజకీయాల్లో ఆయనకంటే ఒక ప్రత్యేకమైన స్థానముంది. ఆయనకు టిక్కెట్టు మార్పు ఉండబోదని ఆ పార్టీ నేతలు సైతం చెబుతున్నారు. ఈయనకు కొంత అసమ్మతిని ముందు నుంచి ఎదుర్కొంటూ వస్తునే ఉన్నారు. ఆ ఐదుగురు నేతలు ఈసారైనా మార్పు చేపట్టి తమలో ఎవరికో ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే అధిష్టానం ఈ మార్పునకు అంగీకరిస్తుందా లేక అనంత వెంకటరామిరెడ్డికే మరోమారు అవకాశం కల్పిస్తుందా అన్నది కూడా చూడాల్సి ఉంది. అసమ్మతి నేతలు మాత్రం రెండు రోజులుగా రాజధానిలోనే మకాం వేసి మార్పు చేపట్టాలని గట్టిగా పట్టుబడుతున్నారు.

విద్యార్థులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ గౌతమి, తదితరులు

విద్యార్థులకు విద్యాదీవెన సాయం

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబర్, డిసెంబర్ – 2023 త్రైమాసికానికి సంబంధించి 40,006 మంది విద్యార్థులకు రూ.29.08 కోట్ల సాయాన్ని అందించారు. శుక్రవారం నాడు కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యాదీవన పంపిణీ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యా దీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్‌పర్సన్ రిజ్వాన్, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రసూల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఎడి రామసుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రాగిపిండిని పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

రేషన్‌కార్డుదారులకు రాగిపిండి పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా పంపిణీలో భాగంగా కార్డుదారులకు రాగి పిండిని శుక్రవారం నుంచి పంపిణీ చేశారు. అనంతపురం నగరంలోని సూర్య నగర్‌లో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం.గౌతమి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో పౌష్టికమైన బియ్యంతో పాటు రాగులు, జొన్నలు, ఫోర్టిఫైడ్ గోధుమపిండిని ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. రాగి పిండి ప్యాకెట్ల రూపంలో 11 రూపాయలకే అందిస్తోందన్నారు. జిల్లాకు 6,67,268 కిలోల రాగి పిండిని కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఒ శోభారాణి, సిఎస్‌డిటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెవివి రాష్ట్ర కార్యదర్శి నాదల్

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రజాస్వామ్యం మనుగడకు అసలైన ఆయుధం ఓటు అని జన విజ్ఞాన వేదిక(జెవివి) రాష్ట్ర కార్యదర్శి నాదల్ పేర్కొన్నారు. స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జెవివి ఆధ్వర్యంలో ఓటు హక్కు, ఓటు నమోదు చేసుకునే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. యువత ఓటు హక్కును సద్వి నియోగం చేసుకోవడంతో పాటు తోటి వారిని చైతన్య పరచాల్సిన బాధ్యత ఉందన్నారు. మతం, జాతి, కులం, వర్గం, భాష, తారతమ్యాలు లేకుండా ఒత్తిళ్లు, బంధుప్రీతి, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల విద్యార్థినుల తో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిందాల్ ఫ్యాక్టరీ వల్లే తాగునీటి సమస్య

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని సర్పంచి గాదెలింగ ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మనహాల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం బొల్లనగుడ్డం గ్రామ సమీపంలో వేదావతి నదిలో గతంలో 6 ఇంచులు బోరు బావి వేసుకుని పైపులైన్ ద్వారా ఫ్యాక్టరీకి నీరు తరలిస్తోందన్నారు. ఆ బోరుబావిని 200 అడుగుల లోతు వరకూ వేసి 16 ఇంచుల కేసింగ్ దింపి అదే పైపులైన్ తీసుకోవడం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. దత్తత గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన జిందాల్ ఫ్యాక్టరీ గ్రామాలకే నష్టం వాటిల్లే చర్యలు తీసుకోవడం ఏంటని గ్రామస్తులు, సర్పంచ్ ప్రశ్నిస్తున్నారు. 5 వేల జనాభా ఉన్న గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

4న 'రా.. కదలిరా..'

కియా వద్ద టిడిపి అధినేత చంద్రబాబు సభ

ప్రజాశక్తి-పెనుకొండ

ఈ నెల 4వ తేదీ కియా మోటార్స్ కంపెనీ ఎదురుగా 'రా.. కదలిరా..' బహిరంగ సభ నిర్వహి స్తున్నామని, ఆ సభకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరవుతారని ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ తెలిపారు. పట్టణంలోని సవితమ్మ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ సాయంత్రం 3 గంటలకు మండలంలోని ఎర్రమంచి గ్రామం కియా మోటార్స్ కంపెనీ ఎదురుగా సవితమ్మ పెట్రోల్ బంక్ పక్కన 'రా.. కదలిరా..' బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు హిందూపురం పార్లమెంట్, పెనుకొండ నియోజకవర్గం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు సవితమ్మ జిల్లా ఇన్‌ఛార్జితో కలసి బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'రా.. కదలిరా..' సభా స్థలాన్ని పరిశీలిస్తున్న రవీంద్ర, సవితమ్మ

జెఎన్‌టియు విసి శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న అమెరికా పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులు

జెఎన్‌టియులో అమెరికా పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులు

డిగ్రీ ప్రోగ్రాం, పరిశోధన సహకారంపై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు వర్సిటీ ఉన్నతాధికారులతో కలిసి అమెరికా పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులతో శుక్రవారం నాడు కాన్ఫరెన్స్ హాల్లో భేటి అయ్యారు. అనంతపురం జెఎన్‌టియులో జరిగిన ఈ భేటిలో డిగ్రీ ప్రోగ్రాం, పరిశోధనలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు విసి మాట్లాడుతూ డిగ్రీ ప్రోగ్రాం, పరిశోధన సహకారం, ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ తదితర అంశాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్ స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ హమీద్ అన్సార్, డాక్టర్ వెంకటరామన్, డాక్టర్ సాయి రామ్, డాక్టర్ టాడ్ క్లార్క్, టివి.రెడ్డి, యూనివర్సిటీ రెక్టార్ ఎం.విజయ కుమార్ , రిజిస్ట్రార్ సి.శశిధర్, ఫారిన్ ఆఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత, వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, సి.శోభాబిందు నగరు, ఎన్.విశాలి, విబి.చిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలు : వ్యకాసం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విలేకరులతో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

బుక్కరాయసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తెరలేపి బిల్లులు కాజేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలంలోని పసులూరులో రూ.3,04,961, చెదుళ్లలో రూ..1,97,332, జంతులూరులో రూ.16,093 ఉపాధి నిధులను అధికార పార్టీ నాయకులు స్వాహ చేశారన్నారు. ఈ అవినీతిలో పాల్పడిన వారిలో అధికార పార్టీ జెసిఎస్ కన్వీనర్, మండల ముఖ్య నాయకుడు, మరొకరు సర్పంచి ఉన్నారన్నారు. ఉపాధిలో యంత్రాలను వాడకూడదని ఉన్నా పైగ్రామాల్లో జెసిబీలను పెట్టి చేయించారన్నారు. పసూలు గ్రామంలో అధికార పార్టీకి చెందిన కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పథకంలో పనులు చేయకుండానే చేసినట్లు చూపి లక్షల రూపాయలు నిధులు కాజేశారన్నారు. ఇందులో మస్టర్లు ఇచ్చింది ఉపాధి సిబ్బంది అయితే, పని చేయకుండానే వేసినట్లు మస్టరు వేసిందని వైసిపి నాయకుడు బయపరెడ్డి బంధువన్నారు. అధికార పార్టీ జెసిఎస్ మండల నాయకుడు వసలూరు బయపరెడ్డి అన్నదమ్ములు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఉంటారన్నారు. ఈ కుటుంబంలో ఎవరూ బయటి పనులకు వెళ్లరన్నారు. అయితే ఈయన కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పథకంలో పనులకు వెళ్తున్నట్లు చూపి నిధులను కాజేశారన్నారు. శింగనమల నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి నమ్మినబంటుగా ఉన్న ఈయన ఉపాధిని ఉపయోగించి అప్పనంగా నిధులు దోచేశరన్నారు. పసలూరు బయపరెడ్డికి సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సరంలో 89 రోజులు పనులు చేసినట్లు చూపి రూ.17,879 లబ్ధి పొందారు. ఇందులో 53 రోజులు బయపరెడ్డి పనులకు వెళ్లినట్లు ఉందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 14 రోజులు పనులు చేసినట్లు చూపి రూ.3414 బిల్లులు చేయించుకున్నారన్నారు. ఇలా పలుసార్లు ఉపాధి పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు చూపి బిల్లులు కాజేశారన్నారు. వీటికి సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులు పసులూరు తదితర గ్రామాల్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగేంద్ర, సంజీవరెడ్డి, నెట్టికల్లు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్

ప్రజాశక్తి-అనంతపురం

వాలీబాల్ ఆడుతున్న అతిథులు

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతకు శుక్రవారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేగాకుండా క్రీడాకారులకు భవిష్యత్తులో ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల్లో ఉన్నంత చురుగ్గా క్రీడల్లో పాల్గొనలేకపోతున్నారు. కావున సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించి క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన యువతకు ట్రోఫీతోపాటు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గరుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్యసౌమ్య, రూడ్‌సెట్ ట్రైనర్ ఉషారాణి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రదీప్, పవన్, యువతీ, యువకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

వైసిపి సమన్వయకర్త విశ్వ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైసిపి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ అన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండలంలోని తట్రకల్లు, ఎన్ఎన్‌పి తండా గ్రామాల్లో రూ.18 లక్షల జెడ్పీ నిధులతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఆ దిశగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. అంతకుముందు ఉరవకొండకు చెందిన వైసిపి నాయకులు ఎంసిఎ నాగభూషణం నూతనంగా నిర్మించిన ఎంసి షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వజ్రకరూరు మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే పయ్యావుల

ప్రజాశక్తి-ఉరవకొండ

వృద్ధురాలికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అనిరంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకానలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బీడీ చినమారయ్య, మాజీ ఎంపిపి ప్రతాప్‌నాయుడు, సర్పంచులు చంద్రశేఖర్, తిప్పారెడ్డి, తిమ్మరాజు, జనార్దన్‌నాయుడు, రాజాస్వామి, టిడిపి అనంతపురం పార్లమెంట్ కార్యదర్శి హనుమంతు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి వన్నూరుస్వామి, నాయకులు నాగరాజు, తిప్పయ్య, రాధాకృష్ణ, మహమ్మద్, భాస్కర్, భీమిలింగప్ప, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమాదేవి

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమాదేవి అధ్యక్షతన సమాచార హక్కు చట్టం, పరిరక్షణ సంఘంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సమాచారం హక్కు చట్టం-2005, స.హ చట్టం కరదీపిక, సంక్షేమ పథకాలు.. స్వరూప స్వభావాలు, ప్రజాస్వామ్య పరిరక్షనే ధ్యేయంగా సమాచార హక్కు చట్టం, భారత రాజ్యాంగం-కనీస అవగాహన, అంబేద్కర్ చారిత్రిక ఉపన్యాసాలు' అనే పుస్తకాలను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.హొన్నూరప్ప మాట్లాడుతూ ప్రజలు, అధికారులకు మధ్య వారధిగా సమాచార హక్కు చట్టం పని చేస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ మాట్లాడుతూ ప్రతి గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టంపై రచించిన పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని స.హ చట్టం ఫలితాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో , ప్రముఖ రచయిత కంబదూరి షేక్ నబిరసూల్, తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చీకులగురికి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేజ్-2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ దాదాపు ఐదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేయడంతో పాటు, ప్రజల ఆరోగ్యస్థితులు కూడా మెరుగు పరుస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చుకుని ఆయురారోగ్యాలతో జీవించాలన్న సదుద్దేశంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్, ఎంపిటిసి కొత్తపల్లి సురేఖ, వైద్య బృందం, వైసిపి నాయకులు మర్రిస్వామి, మహేష్, శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మంచి సినిమాలతోనే గుర్తింపు

'వెయ్ దరువెయ్' టీంతో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రభాకర్‌చౌదరికి పుస్తకం అందజేస్తున్న సినీబృందం

అనంతపురం కలెక్టరేట్ : మంచి సినిమాలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. శుక్రవారం 'వెయ్ దరువెయ్' సినిమా హీరో సాయిశంకర్ నగరంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. అనంతరం టీం తో కలిసి మాజీ శాసనసభ్యులు ప్రభాకర్ చౌదరి చేతుల మీదుగా వీడియో లాంచ్ చేయించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ మంచి సినిమాలతో ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని, సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు.

ఈక్రాప్ బుకింగ్‌లో సమస్యలు తెలియజేయండి

గార్లదిన్నె : ఈక్రాప్ బుకింగ్‌లో ఉన్న సమస్యలను తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రబీలో సాగు చేసిన పంటలకు రైతుభరోసా సిబ్బంది పంట నమోదు ప్రక్రియను చేశారన్నారు. మండలంలో 1730 మంది రైతులకు సంబంధించిన 4028 ఎకరాల్లో ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు తెలిపారు. పంట నమోదు చేసిన రైతుల ముసాయిదా జాబితాను ఇప్పటికే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పెట్టామన్నారు. వీటిపై రైతులకు అభ్యంతరాలు, సందేహాలు ఉంటే ఈనెల 5వతేదీలోపు రైతు భరోసా సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

బహుజన కులాలు ఏకంకావాలి

పోస్టర్లను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

గుత్తి : అధికారం కోసం దేశంలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఏకం కావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం, గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో 'బహుజనుల కులాల పాలన రావాలి' అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడిదారీ కులాలు, ఆదిపత్య కులాల పాలన పోయి ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ కులాల పాలనలో దేశం. రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాప్తాడు ఇన్‌ఛార్జి టి.ఓబులేసు, గుంతకల్లు నియోజకవర్గ కన్వీనర్ బి.వెంకటకొండయ్య, నాయకులు విజయ్, ఆదినారాయణ, రంగనాయకులు, రాధమ్మ, సుధాకర్, కరీంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీ

గుత్తి : పురపాలక సంఘం పరిధిలో 2023-24 పన్నులు 2వ అర్థ సంవత్సరం చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకమొత్తం చెల్లించిన వారికి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియం చేసుకోవాలని కోరారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

వాలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న నాయకులు

బెలుగుప్ప : మండల కేంద్రంలో ఐదుగురు వాలంటీర్లకు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. బెలుగుప్ప గ్రామానికి చెందిన లింగన్న, పవిత్ర, అనిత, ఆవులన్న గ్రామానికి చెందిన వెంకటేశులు, ఎర్రమ్మకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, జడ్పిటిసి మమత త్రిలోక్‌రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, ఏవో దామోదరయ్య, పురుషోత్తం, రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండెవైద్యశిబిరం

గుంతకల్లు : పట్టణ పరిధిలోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న వివేకానంద ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఎంబిఎ, ఎంసిఎ) కళాశాలలో రాచేపల్లి బిసి.వన్నూరప్ప ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేయన్ను వైద్య శిబిరంలో జిఆర్‌బిఎస్, బిపి, ఇసిజి, 2డి ఎకో వంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు, అధికారులు

బెలుగుప్ప : మండల పరిధిలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఉరవకొండ రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శివ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధిలోని బెలుగుప్ప, బెలుగుప్ప తాండ, తగ్గుపర్తి, దుద్దేకుంట, గంగవరం, శీర్పి, రామసాగరం, కోనాపురం గ్రామాల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మౌలిక వసతులను పరిశీలించి స్థానిక సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-శింగనమల

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో నాయకులు

శింగనమలలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పలువురికి మంజూరైన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు సిఫారసు చేసిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మధ్యవర్థులు, దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఆయా పథకాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలంటే మరోసారి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ-2 ఉమా, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో దాదాపు 436 మందికి శుక్రవారం ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియ మాట్లాడుతూ మండల కేంద్రంలో అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు తెలిపారు. ఇంత చేసిన జగనన్న రుణం తీసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎంపిడిఒ రాముడు, గూగూడు ఎంపిటిసి రాజారెడ్డి, నాయకులు మన్నీల శివయ్య, మోహన్, చికెన్ గోపాల్, రమేష్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బడుగుల అభివృద్ధి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు అన్నారు. శుక్రవారం సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వజ్రకరూరు, విడపనకల్ మండల కేంద్రాల్లో పర్యటించి ఆయా పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో విజయం సాధించడంతో రాష్ట్రంలోని క్యాడర్‌లో కూడా ఉత్సాహం వచ్చిందన్నారు. దీంతోనే ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, పిసిసి అధ్యక్షురాలు షర్మిల సభలు నిర్వహిస్తూ కార్యకర్తలను చైతన్యం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు విసుగు చెందారన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్‌తోపాటు పెద్ద పరిశ్రమలు రావాలన్నా.. ఉన్న పరిశ్రమలు ప్రయివేటుపరం కాకుండా ఉండాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికీ రూ.5వేల పెన్షన్ ఇస్తోందన్నారు. దీంతోపాటు రైతులకు రుణమాఫీ, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర వాటిపై ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వజ్రకరూరు, ఉరవకొండ మండలాల కన్వీనర్లు మధుసూదన్, విరూపాక్ష, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రేగాటి చెన్నప్ప, సోనియా సీనా, జిల్లా కార్యదర్శి, హోతూరు లింగన్న, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోసా రాము, బి.సుంకన్న, కుమార్‌స్వామి, పాల్తూరు హనుమంతు, సిపిఐ నాయకులు మల్లికార్జున, చెన్నరాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత, కమిషనర్ మేఘస్వరూప్

నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును కమిషనర్ మేఘ స్వరూప్‌తో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పరిశీలించారు. గురువారం రాత్రి డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే శుక్రవారం ఉదయాన్నే అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి కారణాలను డంపింగ్ యార్డు వద్ద పని చేసే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడారు. ఇక్కడ ఒకేసారి మంటలు చుట్టూ వ్యాపించడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. కాగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, బయటి వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. మంటలు అదుపులోకి వచ్చాయని, అయితే కింది భాగంలో అగ్ని కీలలు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కడా మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

ఆటోడ్రైవర్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రాజేష్ కుటుంబానికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఆటో డ్రైవర్ రాజేష్ ఫిబ్రవరి 20న ఆటో నడుపుకుంటూ బియ్యం బస్తాలు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు రాజేష్ మెదడులో రక్తం గడ్డ కట్టడం వలన కుప్పకూలాడని, వెంటనే బెంగళూరుకు తరలించాలని చెప్పారు. దీంతో రాజేష్ స్నేహితులు విరాళాలు సేకరించి వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తనయులు శుక్రవారం ఉదయం బాధిత ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు.

కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలి

పుట్లూరు : మండలంలోని అరకటవేముల గ్రామంలో కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం స్థానిక సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి డి.పెద్దయ్య మాట్లాడుతూ అరకటవేములలో తరచూ కుక్కలు, కోతులు చిన్నారులు, వృద్ధులు, ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. ఒక్క గురువారం రాత్రి ఇద్దరిని, శుక్రవారం ముగ్గురిని గాయపరచడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కోతులు, కుక్కల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ నాయకులతోపాటు కుక్కకాటుకు గాయపడిన బాధితులు అంజనమ్మ, అంకాలమ్మ, సౌజన్య, నాగ మునయ్య, వెంకటరాముడు, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఉన్న అరవింద పంప్‌హౌస్‌కు చెందిన పైప్‌లైన్ లీకేజ్ కావడంతో విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో శుక్రవారం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటికి ఎవరూ ఇబ్బంది పడకూడని మున్సిపల్ పరిధిలో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.

పెన్నానదిలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న కూలీలు

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముస్లిం నాయకులు

మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (ఏపీఎస్ ఆర్టీసీ) విభాగం ముస్లిం, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన క్యాలెండర్లను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ఎపి రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్‌అహ్మద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్‌ఎ షరీఫ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఎండి అలీ, రాష్ట్ర ట్రెజరర్ ఎస్.బాషా, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.అబ్దుల్‌రెహ్మాన్, వైసిపి నాయకులు జి.శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : ఎపి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం మార్చి 3వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఓబుళరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2012 నుంచి 31-08-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుంచి 31-08-2014 మధ్య జన్మించి ఉన్న వారు అర్హులన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గార్లదిన్నె : ఆదర్శ పాఠశాలలో 2024-2025 సంవత్సరానికి 6 తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి మార్చి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ భాషలో ఉంటుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం పరిధిలో రబీ సీజన్‌లో ఈక్రాప్ చేసిన రైతుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ 2023-24 ఈపంట నమోదు కార్యక్రమం ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రం సిబ్బంది చేశారన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల జాబితాలను ఇప్పటికే ఆయా ఆర్‌బికెల్లో అతికించామని, వాటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 5వతేదీలోపు తెలపాలని కోరారు.

నేరాలు ఘోరాలు

నగల షాపులో చోరీ.. దొంగ పట్టివేత

రాయదుర్గం : పట్టణంలోని వినాయక కూడలి న్యూ రోడ్‌లో గురువారం రాత్రి ఓ దొంగ నగల దుకాణంలో చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డాడు. దుకాణంలో కొనుగోలు చేసేందుకు వచ్చినట్టు నటించిన యువకుడు 2 తులాల బంగారు ఆభరణం తీసుకొని పరిగెత్తాడు. అప్రమత్తమైన దుకాణం యజమాని కేకలు వేయగా చుట్టు పక్కల ప్రజలు ఆ యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కొద్దిరోజుల క్రితం సమీపంలోని ఓ నగల దుకాణంలో ఇదే తరహాలో ఓ యువకుడు బంగారు ఆభరణం ఎత్తుకెళ్లి ఆత్మకూ రు వీధి వైపు పరారీ అయ్యాడు. దొంగను అదుపులో తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

డ్రిప్పు వైర్లకు నిప్పు

కాలిన డ్రిప్పు వైర్లు

బెలుగుప్ప : మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో గురువారం రాత్రి రైతు పాటిల్ రంగారెడ్డి తన ఇంటిపై ఉన్న డ్రిప్పు వైర్లకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో కాలిబూడిదైంది. వివరాల్లోకి వెళ్తే... రంగారెడ్డి ప్రభుత్వం నుంచి సబ్సిడీ ద్వారా వచ్చిన 31 డ్రిప్ వైర్ల కట్టలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్లారు. మంటలు ఎగిసి పడటంతో రైతుతోపాటు స్థానికులు మంటలను అదపు చేశారు. అయితే అప్పటికే డ్రిప్పు వైరు కట్టలు పాక్షికంగా కాలి పోయి పనికి రాకుండా పోయాయని బాధిత రైతు వాపోయాడు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

బొమ్మనహాల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు, స్పెషల్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కెజిబివి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 287 మందికి గానూ 263 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను స్పెషల్ సిట్టింగ్ స్క్వాడ్ ఎస్.వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు పర్యవేక్షించారు.

నార్పల : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. 217 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ బాలప్ప తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సందర్శించి కళాశాల ఆవరణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకోండి

కుందుర్పి : బండమీదపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ పరిధిలోని రైతులు వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షులు వన్నూరురెడ్డి సూచించారు. కుందుర్పిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బండమీదపల్లి సహకార సంఘం బ్యాంకులో సికెసిసి, సిసిఎల్, ఎల్‌జి రుణాలు తీసుకున్న రైతులు మార్చి 31వ తేదా లోపు కేవలం వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఇఒ జాలప్ప పాల్గొన్నారు.

'మున్సిపల్ కమిషనర్‌పై ఎస్ఇసికి ఫిర్యాదు చేస్తాం'

రాయదుర్గం : మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని కలిసి సత్కరించడం పట్ల బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ అభ్యర్థి చిందనూరు నాగరాజు ఖండించారు. మున్సిపల్ కమిషనర్‌పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఇసి)కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గురువారం రాయదుర్గం మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.కిషోర్ అదే రోజు మెట్టు గోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడాన్ని ఆయన తప్పు పట్టారు. మున్సిపల్ కమిషనర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కొనసాగుతారు. ఎన్నికల నియమ నిబంధనల ను మేరకు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఒక పార్టీ అభ్యర్థిని కలవడం, సన్మానించడం అత్యుత్సా హమే అవుతుందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని నాగరాజు తెలిపారు.

ఆర్టీసీ అద్దె బస్సు నిర్వాహకుడిపై ఫిర్యాదు

రాయదుర్గం : రాయదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలో రాయదుర్గం-బళ్ళారి మధ్య తిరుగుతున్న హయ్యర్ అద్దె బస్సు నిర్వాహకుడు బెదిరించడం పట్ల ప్రయాణికుడు ప్రభాకర్ శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొద్దిరోజుల క్రితం హయ్యర్ బస్సు బళ్లారి నుంచి రాయదుర్గం వస్తుండగా ప్రభాకర్‌తో పాటు మరికొందరు ప్రయాణికులు ఆపమని చేయి ఎత్తినా డ్రైవర్ మారుతి ఆపకుండా వెళ్లడంతో ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిపో అధికారులు డ్రైవర్ మారుతిని విధుల నుంచి పక్కన పెట్టారు. దీంతో ఆగ్రహించిన హయ్యర్ బస్సు నిర్వాహకుడు హరి ఫోన్ ద్వారా బెదిరించి దుర్భాషలాడినట్లు ప్రభాకర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై డిపో మేనేజర్ సురేష్‌ను వివరణ కోరగా ప్రయాణికుల ఫిర్యాదు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రైవర్ మారుతిని విధుల నుంచి పక్కన పెట్టినట్లు తెలిపారు.

వార్షికోత్సవానికి ఆర్థికసాయం

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న జామియా అన్వారుల్ ఉలూమ్ మదరసాలో మార్చి 4వ తేదీ నిర్వహిస్తున్న వార్షికోత్సవానికి శుక్రవారం రాయదుర్గం అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ తరపున రూ. 25 వేలను మదరసా కమిటీ సభ్యులు జక్రియకు అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు శర్మాస్, కార్యదర్శి ఎల్.మహమ్మద్ షఫీ, కోశాధికారి డి.అహ్మద్‌హుస్సేన్, సభ్యులు ఖాసిం, రజాక్, షాకీర్, జాకీర్ పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో మహిళా పోలీసుకు పతకం


పతకం అందుకుంటున్న మహిళా కానిస్టేబుల్

అనంతపురం క్రైం : మహారాష్ట్రలోని నాగపూర్ లో గతనెల 26 నుంచి మార్చి 2 వరకూ జరిగే 72వ జాతీయ పోలీసు క్రీడల్లో జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుల్ పతకం సాధించింది. యోగా విభాగంలో అనంతపురం జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ మహిళా పోలీసు కానిస్టేబుల్ దీప, విశాఖపట్నం దిశా పోలీస్ స్టేషన్ సి.ఐ కళ్యాణితో కలిసి రిథమిక పెయిర్ యోగాసనాల విభాగంలో పాల్గొన్నారు. ఈ యోగాసనంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ పతకాలను కైవసం చేసుకున్నారు. విజేత దీపను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

ఎన్నికల కోసం సన్నద్ధం

కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలు - 2024 కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం ఫామ్ ల తొలగింపులు, ఎపిక్ కార్డుల ముద్రణ మరియు పంపిణీ స్థితి, శిక్షణా కార్యక్రమాలు, ఫిర్యాదులు %డ% ప్రతికూల వార్తలు, డిఈఎంపి, జిల్లా కంట్రోల్ రూమ్/సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ/ నివేదిక నిర్వహణ వ్యవస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుండి జిల్లా నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులకు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ దాదాపు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, డిఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.